సాక్షి
వికారాబాద్

మంగళవారం, 14, మార్చి, 2023



.. మాకోన్యాయమా?
మెడికల్ విద్యార్థి ప్రీతి మరణంపై ప్రభుత్వం, స్పందించకపోవడం అన్యాయమని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. 8లో▸



బ్రహ్మోత్సవం
బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



పల్లెల్లో సిమెంటు రోడ్లు
గ్రామీణ రహదారులకు మోక్షం లభించింది. ఉపాధిహామీ నిధులతో వీధుల్లో సిమెంట్ రహదారులను నిర్మిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

బాలుడిపై కుక్క దాడి
- తీవ్రగాయాలు
- చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలింపు



తీవ్రంగా గాయపడిన బాలుడు శివకుమార్

కుల్కచర్ల: కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలోచోటు చేసుకుంది.వివరాలిలా ఉన్నాయి. బొంరెడ్డిపల్లికి చెందిన హేమలత, అనంతరెడ్డి దంపతుల కుమారుడు శివకుమార్ (11) ఆదివారం రాత్రి వేళ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కుక్కదాడి చేసింది. మొఖం, గొంతుపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివకుమార్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కుక్కను బెదిరించలేకపోయాడని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబీకులు తెలిపారు. ఇదిలా ఉంటే బాలుడి తండ్రి రెండేళ్ల కిందట మృతిచెందాడు. బాలుడు స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.

ఢిల్లీ ఫెస్టివల్ ఫుడ్ సెమినార్‌కు ఎఫ్‌పీఓ ప్రతినిధులు



ఢిల్లీకి వెళ్తున్న ఎఫ్‌పీఓ సంఘం చైర్మన్, షేర్ సంస్థ ప్రతినిధి

యాలాల: దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఫెస్టివల్ ఫుడ్ సెమినార్‌కు యాలాల రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు సోమవారం బయలుదేరివెళ్లారు. సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, షేర్ సంస్థ ముఖ్య కార్యదర్శి మరాఠి నర్సింహులు సంఘం తరఫున సెమినార్‌కు వెళ్లారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. తాండూరు కందిపప్పునకు భౌగోళిక గుర్తింపు సాధించడంతో కీలకపాత్ర పోషించిన ఉత్పత్తిదారుల సంఘం తరఫున సెమినార్‌కు వెళ్లడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. వారితో పాటు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ కూడా హాజరవుతున్నట్లు వారు తెలిపారు.


స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



విద్యార్థులకు అర్హత పోటీలు నిర్వహిస్తున్న పీఈటీలు

కుల్కచర్ల: స్పోర్ట్స్ అకాడమీ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు సోమవారం మండల కేంద్రంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైబర్ వెల్ఫేర్ స్కూల్స్ ప్రత్యేకాధికారులు రాజు, వరలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి పది మంది బాలికలు, 10 మంది బాలురను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రాజేందర్, పద్మజ, కుమార్, నవనీత, రవిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్విన్‌కుమార్

వికారాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరికీ సీపీఆర్ (హృదయశ్వాసకోశ పునర్జీవన చర్య)పై అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్విన్ కుమార్ అన్నారు. ఎవరైనా అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు కృత్రిమ శ్వాస కల్పించి ప్రాణాన్ని దక్కించవచ్చన్నారు. సోమవారం సీపీఆర్‌పై జిల్లాలోని పలువురు వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ సిబ్బందికి, ఆశా వర్కర్లకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాయిబాబ, టీబీ అధికారి డాక్టర్ రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

94.76% పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటెత్తిన ఉపాధ్యాయులు
- జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఓటింగ్
- మొత్తం ఓటర్లు: 1,890
- పోలైన ఓట్లు : 1,791



వికారాబాద్‌లో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు

వికారాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం జిల్లాలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 94.76 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 8 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. రోజంతా ఒక్కొక్కరుగా వచ్చి ఓటు వేసి వెళ్లారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు రోజంతా హుడావుడిగా కనిపించారు. వాహనాలు ఏర్పాటు చేసి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ రోజునా సంఘాల నేతలు తమ అభ్యర్థులకు ఓట్లు వేయించేందుకు డబ్బులు పంచినట్లు చర్చజరుగుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఎన్నికలను పర్యవేక్షించారు. జిల్లాకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ వ్యవహరించారు.

ఆ మండలాల్లో వంద శాతం..

జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటుచేశారు. వికారాబాద్ మండల కేంద్రంలో మాత్రం రెండు ఏర్పాటు చేయగా, కొత్తగా ఆవిర్భవించిన కోట్‌పల్లి మండలంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేదు. జిల్లాలో 1,890 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,231 ఉండగా, 659 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి వేగం పుంజుకుంది. ఉదయం 10 గంటల వరకు 16 శాతం, మధ్యాహ్నం 12 గంటలవరకు 46 శాతం, 2 గంటలకు 79 శాతం, సాయంత్రం 4 గంటలకు 94.76 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అధికారిక సమాచారం ప్రకారం జిల్లాలో 1,890 ఓటర్లకు 1,791 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,232 మంది పరుషులకు 1,172 మంది, 658 మహిళలకు 619 మంది ఓటు వేశారు. బొంరాస్‌పేట, పెద్దేముల్, దోమ పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం పోలింగ్ నమోదయ్యింది. బంట్వారంలో అత్యల్పంగా 87.5 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 18 మంది ఎస్‌ఐలు, 120 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వికారాబాద్‌లో అదనపు ఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో పోలీసులు విధులను నిర్వహించారు.

పోలింగ్ సరళిపై ఆరా..

ఎలాంటి అవకతవకలు.. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను సందర్శించారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ముందుగానే ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన పరిశీలించారు. బందోబస్తును పర్యవేక్షిస్తున్న అడిషనల్ ఎస్పీ మురళిధర్‌తో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ప్రశాంత, సక్రమ ఎన్నిక నిర్వహణకు కృషిచేసిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. వికారాబాద్ తహసీల్దార్ వాహిదా ఖాతున్ ఆయనతో పాటు ఉన్నారు.



వికారాబాద్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల వివరాలు..

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
కొడంగల్	80	76
బొంరాస్‌పేట	18	18
దౌల్తాబాద్	27	24
తాండూరు	438	416
యాలాల	62	56
బషీరాబాద్	30	29
బంట్వారం	23	23
పెద్దేముల్	23	23
వికారాబాద్	330	300
వికారాబాద్	241	228
ధారూరు	29	28
మర్పల్లి	21	20
పూడూరు	56	53
నవాబుపేట	50	48
మోమిన్‌పేట	58	57
కుల్కచర్ల	91	88
దోమ	47	47
పరిగి	273	266

ఊరూరా ఉపాధి

- గ్రామంలో వంద మందికి చొప్పున పని
- వంద రోజులు తగ్గకుండా చర్యలు
- పనుల గుర్తింపులో సిబ్బంది
- ఇప్పటికే పలు చోట్ల ప్రారంభం

యాలాల: ఒక్కో గ్రామానికి వంద మందికి, వంద రోజులకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో సిబ్బంది ఉపాధి పనుల గుర్తింపుల్లో తలమునకలై ఉన్నారు. వేసవి ప్రారంభం కావడంతో పూర్తి స్థాయిలో పనులు కల్పించేలా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో భరోసానిస్తోంది. జాబ్‌కార్డులు ఉన్న కుటుంబాల నుంచి శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి కల్పిస్తుంటారు. ఆయా గ్రామం నుంచి 30 మంది మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారు. కనీసం 100 మందికి ఉపాధి పని కల్పించేలా చూడాలని కలెక్టర్ ఇటీవల సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది ఆయా గ్రామాల్లో చెరువుల్లో పూడిక తీత, కాల్వల్లో కంప చెట్ల తొలగింపు, రైతుల పొలాలకు ఫార్మేషన్ రోడ్డు పనులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రోడ్లుకిరువైపులా నాటిన మొక్కల ప్రదేశాల్లో కంప చెట్ల తొలగింపు పనులను చేపడుతున్నారు. ప్రతి గ్రామం నుంచి వంద మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. ఏ గ్రామంలోనైనా వంద మందికి తగ్గితే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదేశించడంతో ఆయా గ్రామాల్లో పనులు గుర్తించే పనిలో ఉపాధి సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

వేసవి ప్రారంభంకావడంతో ఉపాధి పనులు జరిగే చోట సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో పనులు చేసే కూలీలు తరచూ వడదెబ్బకు గురి అవుతున్నారన్నారు. ఇందుకోసం పనిచేసే చోట తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంటు సౌకర్యం ఉండేలా చూడాలని కోరుతున్నారు. వీటితో పాటు కూలీ పనులకు వచ్చే నిరుపేదలకు ఉచితంగా పార, గడ్డపార, గంపలు అందించేలా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పనికల్పించడంతో పాటు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా దృష్టిసారించాలని కోరుతున్నారు. అలాగే ఉపాధి కూలి రేట్లు కూడా సవరించాలని వారు డిమాండ్ చేశారు.నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం ఇస్తున్న కూలీలు ఏ మాత్రం సరిపోవడంలేదన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కూలీలందరికీ పని కల్పిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలో వంద మందికి పని కల్పిస్తాం. మరోవైపు వంద రోజుల పాటు పనులు నిర్వహించేలా కృషి చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో పనులను గుర్తిస్తున్నాం. ఉపాధి కూలీల వ్యక్తిగత ఖాతాలకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో కూలీలకు పని కల్పించేలా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. వేసవిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– జనార్దన్, ఏపీఓ, యాలాల



ఎన్కెపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పొదల దారిలో.. గుబులు ప్రయాణం



బషీరాబాద్ మార్గంలో ఇరువైపులా ముళ్ల చెట్లు

రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలతో ఆహ్లాదంగా ఉండాల్సిన దారి ముళ్లపొదలతో దడపుట్టిస్తోంది. బషీరాబాద్– తాండూరు ప్రధాన రహదారి పొడవునా ముళ్ల చెట్లు ఉన్నాయి. వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే సమయాల్లో ముళ్లకంపలపై పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగాయని వాహనదారులు వాపోతున్నారు. అలాగే మండలంలోని కాశీంపూర్ నుంచి బషీరాబాద్ వరకు, బషీరాబాద్ నుంచి మైల్వార్ వరకు గల దారుల్లోనూ ఇరువైపులా ముళ్ల చెట్లు విస్తరించి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– బషీరాబాద్

సమస్యలు పరిష్కరించండి

కడ్తాల్: పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడిరైతులు సోమవారం తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ భరత్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి, వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా పాలసేకరణ ధర పెంచాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

అణగారిన వర్గాల రాజ్యస్థాపనకు కలసిరండి

కొందుర్గు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాల రాజ్యస్థాపన కోసం దళిత్ శక్తి ప్రోగ్రాం చేపట్టిన పది వేల కిలోమీటర్ల పాదయాత్రకు అందరూ కలిసి రావాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పది వేల కిలోమీటర్ల పాదయాత్ర సోమవారం కొందుర్గు మండలంలోని తంగెళ్లపల్లి, చెర్కుపల్లి, మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అణగారిన వర్గాల రాజ్యం స్థాపించినప్పుడే అగ్రకులాల్లో ఉన్న పేదలకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. పేదల రాజ్యం వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలందరికీ ఉచితంగా వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వస్తాయన్నారు.

ఐటీ దాడుల కలకలం



వెంకటరమణ జ్యువెల్లర్స్ దుకాణం

గ్రామీణ ప్రాంత నేపథ్యమున్న పరిగి, షాద్‌నగర్‌లో ఐటీ దాడులు కలకలం రేపాయి. శ్రీవెంకటరమణ జ్యువెల్లర్స్ దుకాణాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారనే వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో పన్ను ఎగవేస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నవారు ఆందోళనకు గురయ్యారు. తమ షాపులపై ఎక్కడ దాడులు చేస్తారోనని పరస్పరం ఫోన్లు చేసి సంభాషించుకున్నారు. నగల దుకాణంలో కొనసాగుతున్న దాడుల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరా తీసేందుకు ప్రయత్నించారు. స్థానిక ప్రజల్లో సైతం సోమవారం ఈ విషయంపైనే హాట్‌హాట్‌గా చర్చ సాగింది. అవినీతి సొమ్ము దొరికిందా..? ఐటీ దాడుల వెనక కారణాలేంటి..? తదితర అంశాలను కనుక్కునే ప్రయత్నం చేశారు. కానీ అధికారులు అత్యంత రహస్యంగా దాడులు కొనసాగించడంతో ఏ చిన్న విషయం కూడా బయటకు రాలేదు. దీంతో మరింత ఉత్కంఠ నెలకొంది.

– పరిగి

దాహం తీరుస్తున్న కృష్ణమ్మ



కొడంగల్ ప్లాంట్‌లో కృష్ణా జలాలు

- శ్రీశైలం నుంచి నిత్యం తాగునీరు
- ప్రతి ఇంటికీ సరఫరా
- మిషన్ భగీరథకు బ్రహ్మరథం

కొడంగల్: జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం తాగునీటిని సరఫరా చేస్తోంది. గ్రామ గ్రామాన కృష్ణమ్మ ప్రజల దాహార్తి తీరుస్తోంది. 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్ మిషన్ భగీరథ పథకంలో పరుగు పరుగున జిల్లాకు వస్తుంటే జనం ఆశ్చర్యానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. వేసవిలో మహిళల నీటి కష్టాలు తీరాయి. శ్రీశైలం నుంచి వచ్చే పాతాళ గంగ ప్రతి వ్యక్తి గొంతును తడుపుతోంది. చాలా వరకు నీటి కష్టాలు తీరాయని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో తాగునీరు అందుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రూ.2వేల కోట్లు, కొడంగల్ డబ్ల్యూటీపీ ప్లాంట్‌కు రూ.267 కోట్లు మంజూరు చేసి మిషన్ భగీరథను విజయవంతంగా నడిపిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతు న్నారు. ప్రస్తుతం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నుంచి గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేసి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రతి రోజూ తాగునీరు



మిషన్ భగీరథ పథకం ద్వారా రోజూ మంచినీరు వస్తోంది. వేసవి కాలంలో బిందెడు నీటి కోసం అవస్థలు ఉండేవి. ఇప్పుడు ప్రతి ఇంటికి శుద్ధ జలం సరఫరా చేస్తున్నారు. మహిళలకు మంచినీటి తిప్పలు లేకుండా చేశారు.

– శోభమ్మ, కొడంగల్

క్లుప్తంగా

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోండి



ఖాతాదారుడికి కారు తాళాలు అందజేస్తున్న బీఎం శ్రీనివాస్

దోమ: గ్రామాల్లో ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దోమ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని బాస్‌పల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన కారును సోమవారం అతనికి అందజేశారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించడంతో పాటు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకున్న వారికి చేయూతనిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆదిల్‌కు 'బెస్ట్ సర్వీస్' అవార్డు



తిరుపతిలో అవార్డు అందుకుంటున్న ఆదిల్

పూడూరు:సామాజిక సేవలకు గాను పూడూరు మండల పరిధిలోని మన్నెగూడకు చెందిన ఆదిల్ గ్రూప్ చైర్మన్ సయ్యద్ ఆదిల్ జాతీయ స్థాయిలో బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు రాధాక్రిష్ణ, గద్దర్ చేతుల మీదుగా తిరుపతిలో అవార్డు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో ఆదిల్ అందించిన సేవలకు గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ వారు తనను గుర్తించి, అవార్డుకు ప్రతిపాదించడం సంతోషంగా ఉందని తెలిపారు.

భర్త కొట్టాడని ఆత్మహత్యాయత్నం

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న మహిళ

కుల్కచర్ల: భర్త కొట్టాడనే కారణంతో మనస్తాపానికి గురైన మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్న సంఘటన కుల్కచర్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చుక్కమ్మకు నాలుగేళ్ల క్రితం ఊరడి రాములుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాములు తరచూ భార్యతో గొడవపడేవాడు. సోమవారం సైతం ఆమెతో వాగ్వాదం చేసి కొట్టాడు. ఎందుకు బతుకుతున్నావ్ చచ్చిపో అనడంతో తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ క్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

మీకో న్యాయం.. మాకో న్యాయమా?

- గిరిజన నేతల మండిపాటు
- 'చలో కలెక్టరేట్'కు బయలుదేరిన పలువురి బైండోవర్

కుల్కచర్ల: మెడికల్ విద్యార్థి ప్రీతి మరణంపై ప్రభుత్వం, పాలకులు పెద్దగా స్పందించకపోవడం అన్యాయమని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో గిరిజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సిద్ధమైన ఆ సంఘం నేతలను కుల్కచర్ల పోలీసులు ముందస్తుగా బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నేతలు గోపాల్‌నాయక్, జానకీరాం చౌహాన్, గంగ్యానాయక్ మాట్లాడుతూ.. పాలకుల తీరు పేద వాళ్లకో న్యాయం.. ధనవంతులకో న్యాయం అనేలా ఉందన్నారు. జీవితంపై ఎన్నో ఆశలతో కష్టపడి చదివిన ఓ గిరిజన విద్యార్థి డాక్టర్‌గా ఎదిగి కుటుంబానికి అండగా నిలిచే సమయంలో తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం కంటితుడుపు వ్యాఖ్యలతో సరిపెట్టిందని మండిపడ్డారు. తమ జాతి ఆడ్డ ప్రాణం పోయినా పట్టించుకోని అధికార పార్టీ నేతలు.. లిక్కర్ స్కాం కేసులో ఈడీ కవితను ప్రశ్నించినందుకే రాష్ట్రమంతటా ఆందోళన నిర్వహించడం ఏమిటని నిలదీశారు. తనబిడ్డపై సీఎంకు ప్రేమ ఉండటం తప్పుకాదని, కానీ అమాయక ఆడపిల్లల ప్రాణాలు పోయినా సరైన తీరులో స్పందించకపోవడం అన్యాయమన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తంచేసేందుకు వెళ్తున్న తమను అదుపులోకి తీసుకోవడం ఏమిటని నిలదీశారు. ఈ కార్యక్రమంలో రవిలాల్, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల పోలీసుల అదుపులో గిరిజన నేతలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 7 తులాల బంగారం, రూ.2.20 లక్షల అపహరణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్ అనే వ్యక్తి అయ్యప్ప కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఓ వేడుకలో పాల్గొనేందుకు శనివారం కుటుంబ సమేతంగా జహీరాబాద్ వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం వికారాబాద్‌కు వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని చూసి చోరీ జరిగిందని గుర్తించారు. ఈక్రమంలో లోపలి గదిలోకి వెళ్లి బీరువా వైపు చూడగా తాళాలు విరగ్గొట్టి దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. అందులో దాచిపెట్టిన నగదు, బంగారం కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడు మాట్లాడుతూ.. ఇంట్లో తాను దాచిపెట్టిన 7తులాల బంగారు నగలతో పాటు రూ.2.20 లక్షలు పోయినట్లుగా తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు, దుస్తులు

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

తాండూరు రూరల్: మండల పరిధిలోని బెల్కటూర్‌లో నాపరాతి లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. సోమవారం ఓగిపూర్ నుంచి తాండూరు వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. స్థానికుల సాయంతో ట్రాలీని పైకి లేపారు.



బెల్కటూర్ వద్ద బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

గుండెపోటుతో వ్యక్తి మృతి

కడ్తాల్: జాతరకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మక్త మాధారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పందెంగుండు పోటీలను తిలకించేందుకు బేగరి రవి(40) మధ్యాహ్నం అక్కడికి వెళ్లాడు. ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆయన్ను చికిత్స నిమిత్తం కడ్తాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

అబ్దుల్లాపూర్‌మెట్: ఈత చెట్టుపై నుంచి కింద పడిన ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారమతిపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దండు కృష్ణస్వామిగౌడ్ (55) రోజు మాదిరిగానే సోమవారం ఉదయం కల్లుగీతకు వెళ్లాడు. గ్రామ శివారులోని ఈత చెట్టు ఎక్కగా ప్రశాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న హయత్‌నగర్ ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి వివరాలను నమోదు చేసుకున్నారు.

బ్రహ్మోత్సవం

బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని గుట్టపైకి తీసుకు రావడంతో వేడుకలు మొదలయ్యాయి. సోమవారం తెల్లవారుజామున ధ్వజారోహణ, గణపతి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం రుద్రహోమం చేశారు. మంగళవారం తెల్లవారు జామున శకటోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్ తెలిపారు.

– కుల్కచర్ల



రుద్రహోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు



ధ్వజారోహణ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు

సుస్వరాల భాగ్యం

తెలుగు సినీ చరిత్ర పుటల్లో ఆర్‌ఆర్‌ఆర్ నాటు.. నాటు పాట నూతన అధ్యాయాన్ని లిఖించింది. ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారానికి ఎంపికై హైదరాబాద్ మహా నగరం పేరును విశ్వ వ్యాప్తం చేసింది. సిటీకి చెందిన గాయకులు పాడిన పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో నవయువ విజయాల భాగ్య 'నగ'రి మణిహారంలో మరో ఆణిముత్యం జత చేరింది. టాలీవుడ్ రాజధానిగా.. సినిమాల తయారీకి చిరునామాగా ఉన్న నగర ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ ఆస్కార్ పురస్కారం వరించడం సిటిజనులకు గర్వకారణంగా మారింది. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా రూపకర్తలు, కథా నాయకులు, నృత్య దర్శకుడు... అందరూ మన సిటిజనులే కాగా నాటు నాటు పాడిన ఇద్దరు యువ గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ ఇక్కడే పుట్టి పెరిగిన వారు కావడంతో సంతోషం ద్విగుణీకృతమైంది.

– సాక్షి, సిటీబ్యూరో



రాహుల్ సిప్లిగంజ్

- నాటు.. నాటు పాటకు ఆస్కార్ పురస్కారం
- కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ సిటీ కుర్రాళ్లే
- విశ్వ సినీ చరిత్రలో మన నగరానికి ఖండాంతర ఖ్యాతి
- ఇరువురు గాయకులపై అభినందనల వెల్లువ

ధూల్‌పేట్‌లో పుట్టి.. దుమ్ము లేపుతున్నాడు..

- నగరంలోని ధూల్‌పేట్‌కు చెందిన ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి.. ఖండాంతర ఖ్యాతి సొంతం చేసుకున్నాడు రాహుల్ సిప్లిగంజ్. ఇంట్లోని గిన్నెలు, స్టీలు ప్లేట్ల మీద దరువేసిన నాటి అల్లరి కుర్రోడు ఆస్కార్ ను ఇంటికి తెచ్చేసుకున్నాడు. నిన్నా మొన్నటి దాకా మన మధ్యనే ఆడి పాడిన రాహుల్ సిప్లిగంజ్ అంతర్జాతీయ స్థాయిలో సినీ ప్రముఖుల మధ్య పాడి ఆడించాడు.
- చిన్నవయసులో గజల్ మాస్టర్ దగ్గర కొన్నాళ్లు శిష్యరికం చేసిన రాహుల్.. మరో వైపు తండ్రికి సహాయంగా బార్బర్ షాప్‌లో పని చేశాడు. ఏడేళ్ల శిక్షణలో గజల్స్‌పై పట్టు సాధించాడు. ఆ సమయంలోనే సినిమాల్లో కోరస్‌గా అలా అలా నాగ చైతన్య తొలి చిత్రం జోష్‌లో 'కాలేజీ బుల్లోడా' పాటతో అవకాశం వచ్చింది.
- ఆ తర్వాత తను పాడిన పాటల సీడీని తీసుకొని వెళ్లి మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణికి వినిపించి, ఆయన సంగీత దర్శకత్వంలో 'వాస్తు బాగుందే' అనే పాడే అవకాశం దక్కించుకున్నాడు. ఆ తర్వాత 'ఈగ'లో టైటిల్ సాంగ్, రచ్చ'లో సింగరేణి ఉంది... బొగ్గే పండింది, 'రంగస్థలం'లో రంగా రంగా రంగస్థలానా,'ఇస్మార్ట్ శంకర్'లో బోనాలు.. వంటి వరుస హిట్ సాంగ్స్‌తో స్టార్ సింగర్‌గా ఎదిగిపోయాడు. ఓ వైపు గాయకుడిగా రాణిస్తూనే మరోవైపు ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా స్వయంగా రూపొందిస్తూ.. మంగమ్మ, పూర్ బాయ్, మాకీ కిరికిరి', 'గల్లీకా గణేష్', 'దావత్'.. ఇలా నగర సంస్కృతీ సంప్రదాయాలకు తనదైన గానాన్ని జతచేసి సక్సెస్ సాధించాడు. గత 2019లో బిగ్‌బాస్ సీజ న్-3లో గెలిచి మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.

కాలభైరవ.. గాన వైభవ..

ప్రముఖ సంగీత దర్శకుడు, నాటు నాటు పాటకు స్వరాలద్దిన కీరవాణి తనయుడు కాలభైరవ.. గత కొంత కాలంగా గాయకుడిగా రాణిస్తున్నాడు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పాడుతున్నాడు. గాయకుడిగానే కాకుండా మత్తు వదలరా, కలర్ ఫొటో సినిమాలకు సంగీత దర్శకత్వం వహించి సత్తా చాటాడు. బాహుబలి 2లో దండాలయ్యా... పాటతో సూపర్ హిట్ కొట్టాడు. నాటు నాటు పాటలో సహ గాయకుడు రాహుల్‌తో కలిసి స్వరం కలిపి ఏకంగా ఆస్కార్‌నే అందుకున్నాడు.

ఆక్రమణను అడ్డుకుంటారా..?

- కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చెరువులో మట్టి డంప్
- తొలగించేందుకు సహకరించని ఇరిగేషన్, రెవన్యూ శాఖ అధికారులు
- చర్యలకు ఉపక్రమించని అధికార యంత్రాంగం



మట్టిని తొలగించడానికి ఏర్పాటు చేసిన జేసీబీ, టిప్పర్లు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు నీటిలో డంప్ చేసిన మట్టిని తొలగించడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. చెరువు ఆక్రమణదారులు కోర్టు ఉత్తర్వులను ఉల్లఘించినా స్టే ఆర్డర్‌ను ఎత్తివేయించడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వందల కోట్ల విలువ చేసే భూములు ఉండటంతో అంతా జట్టు కట్టి చెరువును కాజేయాలనే కుట్ర పన్నుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు సర్వే నెంబర్లలో ప్లాట్లు చేసి పెట్టినా.. మూడేళ్లుగా నీరు ఉండటంతో అంతా మిన్నకున్నారని వాదనలున్నాయి.

ప్రజాధనం వృథా

మాసబ్ చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగించడానికి మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ప్రతీరోజు జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నుంచి మాత్రం ప్రోత్సాహం కరువైంది. సోమవారం ఆరు టిప్పర్లు, మూడు జేసీబీలు, ఐదు ట్రాక్టర్లు చెరువు వద్ద మట్టి తొలగింపు పనులకు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూసి మున్సిపల్ సిబ్బంది వాహనాలను తిరిగి పంపించేశారు. దీంతో వాహనాలకు అద్దె చెల్లించేందుకు సుమారు రూ.50వేల ప్రజాధనం వృథా అయింది. ఈ నెల 6న 'సాక్షి' దినపత్రికలో 'మాసబ్ చెరువుపై రియల్ కన్ను' అనే కథనం ప్రచురితమైంది. నాటి నుంచి ఇప్పటికి మూడు, నాలుగు సార్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. దీంతో వాహనాల అద్దె భారం మున్సిపాలిటీపై పడుతోంది.

కోర్టు ఉత్తర్వులు ఉన్నా....

సర్వే నెంబర్ 205లోని తమ భూమిలోకి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వచ్చి ఇబ్బంది కలిగించవద్దని సదరు భూ యజమానులు 2022 మేలో హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం భూమి యజమానులు కూడా మట్టిని నింపకూడదు. అయినప్పటికీ యథేచ్ఛగా వందల కొద్ది టిప్పర్ల మట్టిని చెరువు నీటిలో డంప్ చేసి కోర్టు నిబంధనలను ఉల్లఘించారు. ఈ స్టే ఆర్డర్‌ను ఎత్తివేయించడానికి సంబంధిత శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సమాధానం కరువు

ఈ విషయంపై సాక్షి ఇరిగేషన్ ఏఈఈ గంగమ్మను వివరణ కోరగా కోర్టు ఉత్తర్వులపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని.. త్వరలోనే డంప్ చేసిన మొత్తం మట్టిని తొలగించి చెరువును కాపాడుతామన్నారు. మట్టిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు వాహనాలను ఏర్పాటు చేసినా మీరు ఎందుకు పట్టించుకోవడం లేదంటే ఆమె సమాధానం దాటవేశారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

శంకర్‌పల్లి: జాతర ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో నిర్వహించిన బీరప్ప జాతరలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్‌సింగ్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒగ్గు మల్లేశ్, మాజీ సర్పంచ్ సంజీవ, నాయకులు ఒగ్గు అంజయ్య, రాజుగౌడ్, శివ యాదవ్, కిషన్ సింగ్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న అనితారెడ్డి

ఘనంగా బీరప్ప బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప స్వామి బోనాల ఊరేగింపు నిర్వహించారు. డోలు తాశాల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం బీరప్ప, కామరాతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, టీపీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ సంగెరి మల్లేష్, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు ఆంద్రూ, నర్సింహ్మగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, నాయకులు జయవంత్, శ్రీరాములు, గరుగు రాజు, కురుమసంఘం నాయకులు నరేందర్, రమేష్, బీరప్ప, శ్రీశైలం, రాజు, శ్రీకాంత్, సురేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని చంపాపేట బాలాజీ గార్డెన్‌లో సోమవారం తెలంగాణ ఓపెన్ రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభను కనబర్చి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కరాటేలోని స్పైరింగ్ విభాగంలో నందిని, స్నేహ, వైష్ణవి, సంధ్య, కటాస్ విభాగంలో యం.వైష్ణవి, జి.వైష్ణవి, మానస, భాగ్యశ్రీలు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా భార్గవి, తేజస్విని, లావణ్యలు సిల్వర్ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణగౌడ్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శివకుమారి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నిబంధనలు పాటించని వాహనదారులు

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాలకు చెందిన విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా వారిలో మార్పు రావడం లేదు. కాగా, ఇక్ఫాయి కళాశాలల్లో ధనికులు, ప్రముఖులు, వ్యాపారవేత్తల, రాజకీయ నాయకుల, ఉన్నతస్థాయి అధికారుల పిల్లలు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో వారి వాహనాల నంబర్ ప్లేట్ బోర్డులు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సోమవారం దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లో ఇక్ఫాయి కళాశాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే కారు బోర్డు ముందు భాగం నిబంధనల ప్రకారం ఉంది. వెనుక భాగం నంబర్ ప్లేట్ ఎవరికి కనిపించకుండా అతి చిన్న అక్షరాలతో ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారివి ఫొటోలు తీసి చలానాలు విధిస్తున్నారని.. ట్రాఫిక్ పోలీసులు నిఘా నుంచి తప్పించుకునేందుకే ఇటువంటి బోర్డును ఏర్పాటు చేసుకున్నారని పలువురు భావిస్తున్నారు. గత కొంత కాలంగా శంకర్‌పల్లి–హైదరాబాద్ రోడ్డులో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విద్యార్థులు కారు రేసింగ్ చేసి జనవాడ గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రాణాన్ని బలిగొన్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా చిన్న నంబర్ ప్లేట్‌తో కనిపిస్తున్న కారు